క్లుప్తంగా

న్యాయవాదుల సంఘ అధ్యక్షునిగా పార్వతీశం


ఎన్నికైన న్యాయవాదుల సంఘ సభ్యులు

భీమునిపట్నం: భీమిలి న్యాయవాదుల సంఘ అధ్యక్షునిగా ఎంవీ పార్వతీశం ఎన్నికయ్యారు. సోమవారం ఈ సంఘ ఎన్నికలు జరిగాయి. కార్యదర్శిగా కె.ఎస్.ఎం.సుధాకర్, కోశాధికారిగా ముమ్ముడిశెట్టి సునీల్, ఉపాధ్యక్షునిగా బమ్మిడి సూర్యనారాయణ, సంయుక్త కార్యదర్శిగా బోర సూర్యప్రకాశ్‌రెడ్డి, కార్యనిర్వాహక సభ్యులుగా బి.అప్పలరాజు, వి.అరుణకుమారి, వై.నర్సింగరావు ఎన్నికయ్యారు.

పైడితల్లమ్మ ఉత్సవాలు ప్రారంభం

పద్మనాభం: మండలంలోని గంధవరంలో సోమవారం తొలేళ్లతో పైడితల్లమ్మ ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. ఈ సందర్భంగా రాత్రి గొర్రుపోతు సంబరం నిర్వహించారు. మంగళవారం పాలధార ఉత్సవం నిర్వహిస్తారు. ఈ సందర్భంగా అమ్మవారి ఆలయ పరిసర ప్రాంతాలు విద్యుత్ దీపాలతో దేదీప్యమానంగా వెలుగొందాయి.

విద్యార్థినికి ఆత్మీయ సత్కారం


అధిక మార్కులు సాధించిన విద్యార్థులతో ఉపాధ్యాయులు

తగరపువలస : ఇటీవల పదో తరగతి పరీక్షల ఫలితాల్లో 594 మార్కులు సాధించిన షేక్ అమీనాను చిట్టివలస శారద పబ్లిక్ స్కూల్ యాజమాన్యం సోమవారం సత్కరించింది. రాష్ట్ర స్థాయిలో ఈ విద్యార్థిని 5వ స్థానంలో నిలిచిందన్నారు. 83 శాతం సగటు మార్కులతో, ప్రతి నలుగురిలో ఒక్కరు గణితంలో నూరు శాతం మార్కులు సాధించినట్టు కరస్పాండెంట్ అనుపమ జ్యోతిర్మయి తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఆమెతోపాటు చైర్మన్ చంద్రమౌళి, ఉపాధ్యాయులు అభినందించారు.

మందుబాబులకు రూ.45 వేల జరిమానా

పీఎం పాలెం : మద్యం సేవించి ద్విచక్ర వాహనంపై ప్రయాణిస్తున్నందుకు మందుబాబులకు న్యాయస్థానం రూ.45 వేలు జరిమానా విధించింది. ఇందుకు సంబంధించి పీఎం పాలెం ట్రాఫిక్ ఎస్‌ఐ వెంకటరావు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. ఇటీవల నిర్వహించిన తనిఖీల్లో పట్టుబడిన 16 మంది మందుబాబులపై పోలీసులు కేసు నమోదు చేశారు. వారిని న్యాయస్థానం ముందు హాజరుపరచగా న్యాయమూర్తి ఒక్కొక్కరికి రూ.2 వేల నుంచి రూ.4 వేల వంతున మొత్తం రూ.45 వేలు జరిమానా విధించారని ఎస్‌ఐ తెలిపారు.

ముగిసిన సంస్కృత శిక్షణ తరగతులు


విద్యార్థులతో ప్రిన్సిపాల్ మంజుల

డాబాగార్డెన్స్ : విశాఖ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఈ నెల 15 నుంచి 26 వరకు సంస్కృత శిక్షణ తరగతులు నిర్వహించారు. శిక్షణ విజయవంతంగా ముగిసిన సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం కళాశాల ప్రాంగణంలో విద్యార్థులకు ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్.మంజుల సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ బహు భాషల్లో ప్రావీణ్యం విద్యార్థులకు ఎంతో అవసరమని తెలిపారు. కో ఆర్డినేటర్ వై.లక్ష్మి, శిక్షకుడు శుభ్రజిత్, డి.అరుణపద్మ పాల్గొన్నారు.

సీఎం జగన్‌ను మరోసారి ఆశీర్వదించండి

- 'నవరత్నాలు ప్లస్'తో అందరికీ మరింత మేలు
- చంద్రబాబును ఎవరూ నమ్మడం లేదు
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరిన రెల్లివీధి, కృష్ణా కాలనీ, వైఎస్సార్ కాలనీవాసులు

భీమునిపట్నం: పేద, బలహీన వర్గాలకు మరింత మంచి జరగాలంటే సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి మళ్లీ ముఖ్యమంత్రి కావాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. ప్రజలంతా మరోసారి ఆశీర్వదిస్తే అందరికీ మరింత మేలు జరుగుతుందన్నారు. వైఎస్సార్‌సీపీ జీవీఎంసీ 3వ వార్డు యువజన విభాగ అధ్యక్షుడు ముక్కి కృష్ణ ఆధ్వర్యంలో రెల్లివీధి, బర్మాకాలనీ, కృష్ణాకాలనీ, వైఎస్సార్ కాలనీ ప్రాంతాల నుంచి 60 మంది సోమవారం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు సమక్షంలో వైఎస్సార్ సీపీలో చేరారు. వారికి ఎమ్మెల్యే కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. అనంతరం ముత్తంశెట్టి శ్రీనివాసరావు మాట్లాడుతూ రాబోయే ఎన్నికలు పార్టీల మధ్య కాదని... పేదలకు, పెత్తందారుల మధ్య జరుగుతున్నాయన్నారు. ఇందులో వైఎస్సార్‌సీపీ పేదల పార్టీ అని పేర్కొన్నారు. సీఎం జగన్ గత ఐదేళ్ల పాలనలో అర్హులందరికీ సంక్షేమ పథకాలు అందించారని కొనియాడారు. అన్ని వర్గాలకు మరింత మేలు చేసేలా నవరత్నాలు ప్లస్ పేరుతో మేనిఫెస్టో - 2024 విడుదల చేశారని తెలిపారు. మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలన్నింటినీ నెరవేరుస్తామని, అన్ని వర్గాలకూ ఎంతో మేలు జరుగుతుందన్నారు. చంద్రబాబునాయుడు ఎవరికీ, ఎన్నడూ మంచి చేయలేదని... ఇప్పుడు ఎన్నికల్లో గెలవడం కోసం నోటికి వచ్చిన హామీలు ఇస్తున్నారని, వాటిని ప్రజలు నమ్మితే తీవ్రంగా నష్టపోతారన్నారు. సచివాలయ, వలంటీర్ల వ్యవస్థ వల్ల అవినీతి జరగకుండా అర్హులందరికీ సులభంగా పథకాల లబ్ధి అందుతోందన్నారు. తాను అందరికీ అందుబాటులో ఉంటూ మంచి పనులు చేస్తున్నానని... గంటా శ్రీనివాసరావు ఎవరికీ అందుబాటులో ఉండరన్నారు. అందువల్ల అందరూ ఫ్యాన్ గుర్తుపై ఓటేసి ఎమ్మెల్యేగా తనను, ఎంపీగా బొత్స ఝాన్సీ లక్ష్మిని గెలిపించాలని కోరారు. అనంతరం పార్టీలో చేరిన వారు మాట్లాడుతూ ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు తమందరికీ ఎంతో మేలు చేశారని, ఆయన గెలుపు కోసం కష్టపడి పనిచేస్తామని తెలిపారు. 3వ వార్డు పార్టీ ఇన్‌చార్జి మైలిపల్లి షణ్ముఖరావు, అధ్యక్షులు అల్లిపిల్లి నర్సింగరావు, వాసుపల్లి కొండబాబు, పోతురాజు, ఎం.అనిల్, జి.నారాయణ, ఎన్.విజయలక్ష్మి, పూర్ణిమ, దుంప లక్ష్మి పాల్గొన్నారు.

అసెంబ్లీ బరిలో 15 మంది

భీమునిపట్నం: భీమిలి అసెంబ్లీ స్థానానికి 15 మంది అభ్యర్థులు ఎన్నికల బరిలో నిలిచారు. మూడు రోజుల క్రితం నామినేషన్ల పరిశీలనలో 17 మందివి అధికారులు ఆమోదించారు. సోమవారం ఇద్దరు అభ్యర్థులు నామినేషన్లు ఉపసంహరించుకోవడంతో 15 మంది బరిలో నిలిచారు. ప్రసాప్రస్థానం పార్టీ అభ్యర్థి దాసరి లక్ష్మి సంధ్య, స్వతంత్ర అభ్యర్థి ఏలూరు ధర్మావతి నామినేషన్లు ఉపసంహరించుకున్నారు.

అభ్యర్థి	పార్టీ	గుర్తు
ముత్తంశెట్టి శ్రీనివాసరావు	వైఎస్సార్ సీపీ	ఫ్యాన్
గంటా శ్రీనివాసరావు	టీడీపీ	సైకిల్
అడ్డాల వెంకట వర్మరాజు	కాంగ్రెస్	హస్తం
భాగం గోపాలరావు	బీఎస్పీ	ఏనుగు
ఇల్లిపిల్లి అనిల్‌కుమార్	జై భారత్ నేషనల్ పార్టీ	టార్చ్‌లైట్
గంటా శ్రీనివాసరావు	జాతీయ జనసేన	పెన్‌స్టాండ్
కోలా హరిబాబు	రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా	వజ్రం
చోడుపల్లి రాజు	సమాజ్‌వాది పార్టీ	సైకిల్ పంప్
చోడుపల్లి శ్రావణ్‌గణేష్	ఇండిపెండెంట్	కుండ
నాగోతు నాగమణి	ఇండిపెండెట్	బకెట్
నూకాల సూర్యప్రకాశ్	ఇండిపెండెంట్	విజిల్
నందికోళ సంధ్య	ఇండిపెండెంట్	వాకింగ్ స్టిక్
బవిరిశెట్టి రమణబాబు	ఇండిపెండెంట్	చెరుకురైతు
బుగత రాము	ఇండిపెండెంట్	గ్లాస్
మేక సత్య కిరణ్	ఇండిపెండెంట్	షిప్

ముత్తంశెట్టికి లక్ష ఓట్ల మెజారిటీ ఖాయం


చిల్లపేటలో ఇంటింటా ప్రచారంలో వైఎస్సార్‌సీపీ నాయకులు


ఆదర్శనగర్‌లో ఇంటింటా ప్రచారం చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: మే 13న జరగనున్న ఎన్నికల్లో వైఎస్సార్‌సీపీ భీమిలి ఎమ్మెల్యే అభ్యర్థి ముత్తంశెట్టి శ్రీనివాసరావు, విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మికి లక్ష ఓట్ల మెజారిటీ ఖాయమని జీవీఎంసీ రెండో వార్డు వైఎస్సార్‌సీపీ నాయకులు తెలిపారు. వార్డు ఇన్‌చార్జి శిల్లా కరుణాకరరెడ్డి ఆధ్వర్యంలో ఆదర్శనగర్‌లో సోమవారం ఇంటింటా ప్రచారం చేశారు. ఈ సందర్భంగా తాతా థియేటర్ యజమాని పరిమి గోపి, డీసీస్ ఉద్యోగులు లంకలపల్లి శంకరరావు, చుక్క గణేష్, ఎస్.రమణ, ఇట్టిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, డి.జె.రాజు, జె.కాషయ్య, కొసన స్వాతి, తదితరులు వైఎస్సార్‌సీపీలో చేరారు. వీరిని జిల్లా కార్యదర్శి జీరు వెంకటరెడ్డి పార్టీలోకి ఆహ్వానించారు. ప్రచార కార్యక్రమంలో నాయకులు చిల్ల బాబయ్యరెడ్డి, చేట్ల ఎల్లయ్యరెడ్డి, చిల్ల ప్రమీల, పీతల వెంకట అప్పారావు, జగన్నాథ ఎల్లాజీ, చిల్ల సూర్యనారాయణరెడ్డి, నమ్మి మాధవరావు, వంశీరెడ్డి, చేట్ల అప్పలసూరమ్మ, జీరు పద్మ, కేవీ రావు, పీతల రాజారావు, నమ్మి భాస్కరరావు, సరగడ నాగిరెడ్డి, చేట్ల ఢిల్లీశ్వరి, గేదెల సన్యాసప్పడు, జీరు భరత్‌రెడ్డి, చేట్ల ఎర్రయ్యరెడ్డి పాల్గొన్నారు.

చిల్లపేటలో ఇంటింటా ప్రచారం

చిల్లపేటలో వైఎస్సార్ సీపీ జీవీఎంసీ 2వ వార్డు అధ్యక్షుడు చిల్ల భాస్కరరెడ్డి, జిల్లా యూత్ విభాగం ఉపాధ్యక్షుడు బింగి హరికిరణ్ రెడ్డి ఆధ్వర్యంలో సోమవారం ఇంటింటా ప్రచారం చేశారు. ఫ్యాన్ గుర్తుపై ఓటు వేసి సంక్షేమ పథకాలు కొనసాగించుకుందామని కోరారు. కార్యక్రమంలో ప్రధాన కార్యదర్శి చిప్పాడ వెంకటేష్, జిల్లా మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి డబ్బీరు ప్రశాంతి, చేనేత విభాగం ప్రధాన కార్యదర్శి తెడ్లాపు అప్పలరాజు, మాజీ సైనికుల సంఘం అధ్యక్షుడు కె.జి.రెడ్డి, సరగడ శివాంజనేయరెడ్డి, జీరు వేణుగోపాలరెడ్డి, మునకాల ఆదినారాయణరెడ్డి, చేట్ల ఎల్లారెడ్డి, శీరపు శ్రీరాములు, బోర వెంకట అప్పారావు, నమ్మి సింహాచలం, చిల్ల సూరి నరసయ్యరెడ్డి, నేదూరి శ్రీనివాసరెడ్డి, రౌతు రాముర్రెడ్డి, జీరు రాము, చిల్ల రాము, జీరు కుమార్, సరగడ వీరుబాబు, దుర్రి రామయ్యమ్మ, మద్ది మహాలక్ష్మి, కొయ్య వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీలో భారీగా చేరికలు


కొత్తవలసలో టీడీపీ, జనసేన నాయకులకు కండువాలు కప్పి వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


రాజీవ్ గృహకల్ప, శారదానగర్‌కు చెందిన టీడీపీ, జనసేన నాయకులను వైఎస్సార్ సీపీలోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

కొమ్మాది: జీవీఎంసీ 4వ వార్డు జేవీ అగ్రహారం పరిధి కొత్తవలసలోని టీడీపీ, జనసేనకు చెందిన 50 మంది నాయకులు సోమవారం వైఎస్సార్‌సీపీలో చేరారు. ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి ప్రకటించిన ఎన్నికల మేనిఫెస్టోకు ఆకర్షితులమై పార్టీలో చేరినట్లు వీరు తెలిపారు. కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, యాత కార్పొరేషన్ డైరెక్టర్ బాడిదబోయిన రాములప్పడు, తదితరులు పాల్గొన్నారు.

జీవీఎంసీ 5వ వార్డు నుంచి 100 మంది..

జీవీఎంసీ 5వ వార్డు రాజీవ్ గృహకల్ప కాలనీ, శారదానగర్ కాలనీకి సంబంధించిన టీడీపీ, జనసేన నాయకులు 100 మంది ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో వైఎస్సార్ సీపీలో చేరారు. కార్యక్రమంలో మాజీ కార్పొరేటర్ పోతిన హనుమంతరావు, జేసీఎస్ కన్వీనర్ పోతిన సురేష్, జేఎస్ రెడ్డి, ముచ్చు రామారావు, సుజాత, లక్ష్మి, పరదేశి, సన్ని, తదితరులు పాల్గొన్నారు.

అప్పట్లో మంచి చేయాలనిపించలేదా గంటా..?

- కుసులవాడ పంచాయతీని దత్తత తీసుకుంటామనడం హాస్యాస్పదం
- సర్పంచ్ వెంకటలక్ష్మి, అనుచరులు టీడీపీకి అమ్ముడుపోయారు
- మీడియాతో వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు బంక సత్యం, నాయకులు


మాట్లాడుతున్న వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సత్యం, నాయకులు

తగరపువలస : 2014 - 2019 మధ్య కాలంలో భీమిలి ఎమ్మెల్యేగా, మంత్రిగా పనిచేసిన గంటా శ్రీనివాసరావుకు అప్పట్లో ఇక్కడి ప్రజలకు ఎందుకు మంచి చేయాలనిపించలేదని వైఎస్సార్‌సీపీ ఆనందపురం మండల అధ్యక్షుడు బంక సత్యం ప్రశ్నించారు. సోమవారం సాయంత్రం పార్టీ మండల కార్యాలయంలో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. మూడు మండలాల్లో 62 పంచాయతీల్లో పేదలైన తూర్పు కాపు, మత్స్యకారులు, యాదవులు ఎందరో ఉన్నారన్నారు. కనీసం తన సామాజిక వర్గం ఎక్కువగా ఉండే ఆనందపురం మండలంలో 26 పంచాయతీలకు అప్పట్లో ఎందుకు మేలు చేయలేకపోయారన్నారు. ఏ పంచాయతీనీ ఎందుకు దత్తత తీసుకోలేదన్నారు. గంటా మంత్రిగా ఉన్నప్పుడు వచ్చిన హుద్‌హుద్, విశాఖ ఉత్తర ఎమ్మెల్యేగా ఉన్నప్పుడు వచ్చిన కరోనా సమయంలో అయినా భీమిలి ప్రజలలో ఒక్కరికైనా సాయం అందించారా అని ప్రశ్నించారు. హుద్‌హుద్ సమయంలో అప్పటి ప్రతిపక్ష నాయకుడు వైఎస్ జగన్ వచ్చి భీమిలిలో మత్స్యకారులు, రైతులను ఆదుకున్నట్టు గుర్తు చేశారు. అదే ఆయన గెలుపునకు సోపానమైందన్నారు. గంటా డబ్బున్న నాయకుడైనా ప్రజల కోసం పైసా విదిల్చే వ్యక్తిత్వం కాదన్నారు. అలాంటి వ్యక్తి కుసులవాడ పంచాయతీని దత్తత తీసుకుంటాననడం హాస్యాస్పదంగా ఉందన్నారు. సీఎం వైఎస్ జగన్ గత ఐదేళ్ల పాలనలో ప్రతి పంచాయతీకి రూ.40 లక్షల సంక్షేమ పథకాలు అందించారని, కోట్లాది రూపాయలతో రైతుభరోసా కేంద్రాలు, సచివాలయ భవనాలు, విలేజ్ క్లినిక్‌లు నిర్మిస్తే అభివృద్ధి కనిపించలేదంటూ చత్వారపు మాటలు సరికాదన్నారు. భీమిలి ఎమ్మెల్యేగా ఈ ఐదేళ్లలో ప్రతి గ్రామంలో 18 సార్లు పర్యటించిన ముత్తంశెట్టి శ్రీనివాసరావుతో గంటాకు పోలికే లేదన్నారు. ఎన్నికల సమయంలో రియల్ ఎస్టేట్ బ్రోకర్లతో, పెద్ద కార్లతో వస్తే నమ్మే స్థితిలో భీమిలి ఓటర్లు లేరన్నారు.

- అనంతరం కుసులవాడకు చెందిన షిణగం దామోదరరావు మాట్లాడుతూ పంచాయతీలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ద్వారా రూ.19 కోట్ల అభివృద్ధి జరిగిందని ఒప్పుకున్న సర్పంచ్ వెంకటలక్ష్మి, ఆమె అనుచరులు రెండు రోజుల్లో మాట మార్చి టీడీపీకి అమ్ముడుపోయారన్నారు. కార్యక్రమంలో పార్టీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, సర్పంచ్ బీఆర్‌బీ నాయుడు, కోరాడ అప్పలస్వామి నాయుడు, బొట్ట రామకృష్ణ, పిన్నింటి వెంకటరమణ, పడాల రాము, చందక అప్పలస్వామి, షిణగం చిన రామారావు, కోన శ్రీను, తదితరులు పాల్గొన్నారు.


వైఎస్సార్‌సీపీ గెలుపు ప్రజలందరిదీ..

- పింఛన్ల పంపిణీని అడ్డుకున్న నీచుడు చంద్రబాబు
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


నాయకులకు హారతిస్తున్న మహిళలు


ప్రచారంలో మాట్లాడుతున్న యాంకర్ శ్యామల

మధురవాడ: వైఎస్సార్ సీపీ గెలిస్తే ప్రజలంతా గెలిచినట్టేనని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మధురవాడ వాంబేకాలనీలో వైఎస్సార్ సీపీ విశాఖ ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మితో కలిసి సోమవారం ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గత ఐదేళ్లలో భీమిలి నియోజకవర్గాన్ని రూ.2500 కోట్లతో అన్నిరకాలుగా అభివృద్ధి చేశామన్నారు. ప్రస్తుత ఎన్నికలు పేదలు, డబ్బున్న పెత్తందారులకు మధ్య జరుగుతున్నాయని... పేదల తరపున వైఎస్సార్‌సీపీ నిలిచిందని, ఆ పార్టీ గెలిస్తే పేదలంతా గెలిచినట్టేనని చెప్పారు. పేదలకు ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటి వద్ద అందించే పింఛన్లను కూడా అడ్డుకున్న నీచుడు చంద్రబాబు నాయుడని మండిపడ్డారు. విశాఖ వాసులంతా సీఎం జగన్‌మోహన్ రెడ్డి నాయకత్వాన్ని బలపరచాలని కోరారు. వాంబేకాలనీలో రూ.2.5 కోట్లతో అండర్ గ్రౌండ్ డ్రైనేజీ వ్యవస్థ మెరుగుపరచడం, పార్కులు, ఓపెన్ జిమ్ ఏర్పాటు చేసినట్టు చెప్పారు. భీమిలి నియోజకవర్గానికి 10 యూపీహెచ్‌సీలు తీసుకొచ్చినట్లు చెప్పారు. ఫ్యాన్ గుర్తుపై ఓటేసి తనతోపాటు ఎంపీ అభ్యర్థి బొత్స ఝాన్సీలక్ష్మిని అధిక మెజారిటీతో గెలిపించాలని కోరారు. ఎమ్మెల్సీ, వైఎస్సార్ సీపీ రాష్ట్ర మహిళా విభాగం అధ్యక్షురాలు వరుదు కళ్యాణి మాట్లాడుతూ ప్రతీ ఇంట్లోనూ మేలు జరిగితేనే ఓటు వేయండని చెప్పే దమ్మున్న నాయకుడు వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అని చెప్పారు. అన్ని వర్గాలకు సీఎం జగన్‌మోహన్ రెడ్డి పాలనలోనే మేలు జరుగుతుందని చెప్పారు. మాజీ మంత్రి పసుపులేటి బాలరాజు మాట్లాడుతూ మనతోపాటు పిల్లల భవిష్యత్‌కి ఎంతో కీలకమైన ఎన్నికలని, అంతా ఆలోచించి అన్ని వర్గాలకు మేలు చేసే వైఎస్సార్‌సీపీనే గెలిపించాలని కోరారు. వాంబేకాలనీని దివంగత ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి హయాంలో ఏర్పాటు చేశారని గుర్తు చేశారు. యాంకర్, నటి శ్యామల మాట్లాడుతూ వాంబేకాలనీ ప్రజల ఉత్సాహం చూస్తే ప్రత్యర్థుల గుండెల్లో దడ మొదలైందన్నారు. ప్రజా సంక్షేమ పాలన వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికే సాధ్యమని పేర్కొన్నారు. ఏపీ నగరాలు కార్పొరేషన్ చైర్మన్ పోతిన శ్రీనివాసరావు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ విశాఖ జిల్లా మహిళా అధ్యక్షురాలు కృపాజ్యోతి, సీనియర్ నాయకుడు శ్రీకాంత్‌రాజు, నాయకులు వంకాయల మారుతీ ప్రసాద్, పిల్లా కృష్ణమూర్తి పాత్రుడు, పిళ్లా సూరిబాబు, చేకూరి రజని, రామిరెడ్డి, జగ్గుపల్లి నరేష్, ఎల్లాజీ, డాక్టర్ కాంతారావు, రాజు, భాస్కరరావు, పోలరాజు, పద్మ, రమణమ్మ పాల్గొన్నారు.


మధురవాడ వాంబేకాలనీలో ప్రచార సభకు విశేషంగా హాజరైన ప్రజలు

జనసేన కార్యకర్తలకు ఆదరణ కరువు

- అందుబాటులో లేని సందీప్
- పట్టించుకోని గంటా, టీడీపీ

తగరపువలస: భీమిలి నియోజకవర్గంలో ప్రస్తుతం జనసేన కార్యకర్తలను ఆదరించేవారే కరువయ్యారు. నెల రోజుల క్రితం వరకు జనసేన భీమిలి ఇన్‌చార్జి పంచకర్ల సందీప్‌కే టికెట్ వస్తుందని ఆశల పల్లకిలో ఊరేగిన జన సైనికుల పరిస్థితి నియోజకవర్గంలో తారుమారైంది. భీమిలి సీటు టీడీపీకి చెందిన గంటా శ్రీనివాసరావుకు కేటాయించడంతో పవన్ పోటీ చేస్తున్న కాకినాడ జిల్లా పిఠాపురం నియోజకవర్గంలో ప్రచారానికి సందీప్ వెళ్లిపోయాడు. అయినప్పటికీ పొత్తులో భాగంగా జనసేనతోపాటు టీడీపీ జెండాలు మోస్తున్న తమకు ప్రాధాన్యత ఉంటుందని జన సైనికులు ఆశించారు. ఈ నెల 18న గంటా నామినేషన్ తర్వాత తమ పరిస్థితి మరింత దారుణంగా దిగజారిపోయిందని వాపోతున్నారు. చెప్పుకుందామంటే సందీప్ అందుబాటులో లేకపోవడం, టీడీపీ వారు తమను అనుమానపు చూపులతో వేధిస్తుండటాన్ని తట్టుకోలేకపోతున్నారు. నామినేషన్ కార్యక్రమంలో బలప్రదర్శనకు సహాయపడిన తమకు చేతి చమురు వదిలిందని బావురుమంటున్నారు. కనీసం టీడీపీ నాయకులు తమను ప్రచారానికి పిలవకపోవడంతో తాము ఎవరికీ చెందకుండా పోయామని వాపోతున్నారు. మనస్సాక్షిని చంపుకుని అభిమానంతో టీడీపీ ప్రచారాలకు వెళ్తే వారి చేతుల్లో చావుదెబ్బలు తప్పడం లేదంటున్నారు. వాస్తవానికి భీమిలి నియోజకవర్గంలో టీడీపీ నాయకులకే పార్టీలో గౌరవం లేదని... బయటి నుంచి వచ్చిన కార్పొరేట్ శక్తుల హవా కొనసాగుతుందన్నారు. ఇలాంటి దయనీయమైన పరిస్థితుల్లో తాము టీడీపీకి ఓటు వేయలేమని... అలాగని ఎవరికీ చెప్పుకోలేమని అంటున్నారు. పవన్‌పై అభిమానంతో ఇతర పార్టీల నుంచి వచ్చిన తాము తిరిగి ఏ ముఖం పెట్టుకుని వేరే పార్టీల్లోకి వెళ్లగలమని అంటున్నారు. వాస్తవంగా సంక్షేమ పథకాలతో ప్రజలకు చేరువైన వైఎస్సార్ సీపీ తమను చేరదీస్తే గతాన్ని మరచిపోయి... తిరిగి వారితో పనిచేయడానికి సిద్ధమని అంటున్నారు.


కారు ఢీకొని వ్యక్తి మృతి


చిన్నబాబు (ఫైల్)

మధురవాడ : మధురవాడ మిథిలాపురి వుడా కాలనీ రోడ్డులో సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో చంద్రంపాలెంకి చెందిన పోతిన చిన్నబాబు మృతి చెందారు. స్థానికులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. సోమవారం మధ్యాహ్నం 11.30 గంటల సమయంలో బైక్‌పై వస్తున్న చిన్నబాబును కారు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడి మృతి చెందారు. ఇతడు శ్రీ దుర్గాలమ్మ ఎర్త్‌మూవర్స్ అసోసియేషన్ అధ్యక్షుడిగా పనిచేస్తున్నారు. చిన్నబాబు మృతితో చంద్రంపాలెంలో విషాదం నెలకొంది.

జగన్ పాలనలో సంక్షేమం... బాబు హయాంలో సంక్షోభం

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు


కొత్తవలసలో కరపత్రాలు అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు, నాయకులు

కొమ్మాది: రాష్ట్రంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనలో సంక్షేమ రాజ్యం కొనసాగితే..., గతంలో చంద్రబాబు హయాంలో సంక్షోభం, కరువు నెలకొన్నాయని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. జీవీఎంసీ 4వ వార్డు జేవీ అగ్రహారం, కొత్తవలస గ్రామాల్లో సోమవారం నిర్వహించిన ఎన్నికల ప్రచారంలో ఆయన పాల్గొన్నారు. గడిచిన ఐదేళ్లలో సీఎం జగన్ పాలనలో అమలు చేసిన పథకాలు, అభివృద్ధిని గడప గడపకు వెళ్లి వివరించారు. నూతన మేనిఫెస్టోపై తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సూపర్ సిక్స్ పేరుతో మరోసారి ప్రజలను మోసం చేసేందుకు చంద్రబాబు, పవన్ చూస్తున్నారని, వారిని రాష్ట్రంలో ఎవరూ నమ్మే పరిస్థితిలో లేరన్నారు. వైఎస్సార్‌సీపీ మేనిఫెస్టోను స్థానిక నాయకులు జోరుగా ప్రజల్లోకి తీసుకెళ్లాలని పిలుపునిచ్చారు.

దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి

ఒక్కొక్కరికి వెయ్యి నుంచి 50 వేల రూపాయల చొప్పున చెల్లించి కండువాలు కప్పి టీడీపీలో చేర్చుకుంటున్న గంటా శ్రీనివాసరావు దిగజారుడు రాజకీయాలు మానుకోవాలని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు హెచ్చరించారు.

ఓటమి తప్పదని ముందే గమనించిన గంటా నాయకులను కొనుగోలు చేస్తున్నాడన్నారు. ఎన్ని ఎత్తులు, జిత్తులు వేసినా రాష్ట్రంలో ఫ్యాన్ ప్రభంజనం ఖాయమన్నారు. కార్యక్రమంలో కార్పొరేటర్ దొలపల్లి కొండబాబు, వార్డు అధ్యక్షుడు పాల రమణా రెడ్డి, క్లస్టర్ ఇన్‌చార్జి బోర రామకృష్ణ, ఎంపీటీసీ మాజీ సభ్యుడు పోతిన శివకుమార్, అప్పలరాజు, మేరుగు చిన్నారావు, విష్ణు, ఈశ్వర్, నల్లబాబు, రామనాయుడు, శ్రీనివాస్, హరి పాల్గొన్నారు.

మనస్తాపంతో వివాహిత ఆత్మహత్య

పద్మనాభం : మండలంలోని గంధవరంలో మందులు వేసుకోవాలని చెప్పినందుకు మనస్థాపం చెందిన వివాహిత ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని ఎస్‌ఐ జామి సురేష్ తెలిపారు. ఎస్‌ఐ అందించిన వివరాలిలా ఉన్నాయి. విజయగనరం జిల్లా కొత్త వెలగాడ గ్రామానికి చెందిన తాండ్రంగి పెంటయ్య కుమార్తె మంగకు పద్మనాభం మండలం గంధవరానికి చెందిన ఇర్ర నాగరాజ్‌తో 20 ఏళ్ల క్రితం వివాహమైంది. మంగ, నాగరాజ్ విజయవాడలో ఉంటున్నారు. మంగ మానసిక పరిస్థితి బాగాలేనందున విజయవాడలోని ఆస్పత్రిలో ఐదు నెలల నుంచి వైద్యం పొందుతోంది. గ్రామ దేవత పండగ కోసం ఈ నెల 26న మంగ, నాగరాజ్ పిల్లలతో కలిసి గంధవరం వచ్చారు. 28న ఆదివారం రాత్రి భర్త నాగరాజ్, పిల్లలు మందులు వేసుకోవాలని మంగకు చెప్పారు.

దీంతో తనకు మందులు ఎందుకు ఎక్కువ ఇస్తున్నారని మంగ ఇంట్లోకి వెళ్లి తలుపులు వేసుకుంది. కొంత సమయం తర్వాత అత్త ఇర్ర సత్యవతి తలుపులు కొట్టగా ఎంతకీ తియ్యలేదు. దీంతో సత్యవతి చుట్టు పక్కల వాళ్లని పిలిచి తలుపులు బద్దలకొట్టగా మంగ ఉరి వేసుకుని వేలాడుతూ కనిపించింది. 108 సిబ్బంది వచ్చి మంగ మృతి చెందినట్టు నిర్ధారించారు. మృతురాలి తండ్రి పెంటయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.